# సీతయ్య

మధ్యాహ్నమయింది. పొద్దున ముసలమ్మ దగ్గిరనుంచి అడుక్కున్న కానీతో రంగు చూసి మోసపోయి ఆ చక్కెర బిళ్ళలు కొనకపోతే, గుగ్గిళ్ళు కొని తింటే ఇప్పుడింత ఆకలి వెయ్యదుకదా అని పశ్చాత్తాపపడ్డాడు సీతయ్య. మధ్యాహ్నం టిఫెన్ కొరకై మామూలు స్థలాలు వెతికాడు. కోమటిరత్నం యింటిముందు పుల్లిస్తరాకులు కుక్కలు చప్పగా నాకేశాయి. ఏమీ ఆశలేదు. ఈవాళ దోసకాయలేమీ కుళ్ళినట్టు లేవు. దుకాణం దగ్గిర ఒక మేకయినా లేదు. మిఠాయికొట్టు దగ్గిర వచ్చి పొయ్యే వాళ్ళని కనిపెడుతూ ఓ కుక్కపిల్ల కానీ కారప్పూస కొనుక్కున్న కోమటిపిల్ల కాళ్ళచుట్టూ తిరిగింది. పరికిణీ పట్టుకులాగింది. వెంట పరుగెత్తి కెళ్ళింది. ఆ కోమటిపిల్ల తంతే దూరానపడి, మళ్ళీ తోకాడించుకుంటూ వెంట పరిగెత్తింది. సందు మలుపులో ఇద్దరూ అదృశ్యమైనారు. ఇదంతా చూశాడు సీతయ్య. తానో కుక్కపిల్లనైనా బాగుండును ఎవరో ఒకరు దయదలచి వుందురు తనమీద. కుయ్యిమని యేడిస్తే తన ఆకలి అబద్ధమనుకోరు. తన మకిలి లాగు పైకి లాక్కుని పట్టుకున్నాడు. బనియను చిల్లుల్లో వేళ్ళు పెట్టుకొని రాజకుమారుడి ఠీవితో చూశాడు రోడ్డువంక.

తాను కుక్కనై యే ధనవంతుడి వెంటనో వాడి ఇల్లు చేరుకుంటే వాడు తనని పెంచుకుంటే? ఎవడు పెంచుకుంటాడు?

పోనీ తనే ఎవణ్ణో తండ్రిగా పెంచుకుంటే నేం? బస్సు డ్రైవరు ప్రకాశి తోడి డ్రైవర్లిద్దరూ, కండక్టరు కోటయ్య వెతుకుతున్నారు. కాఫీ హొటల్‌నుంచి, బస్సుస్టాండు దగ్గిరికి-

సీతయ్య వాళ్ళ వెనకనే వెళ్ళి, ప్రకాశి చొక్కా పట్టుకులాగాడు. అతను వెనక్కి తిరిగి,

"ఏం కావాలిరా?"

"నీ కోసమే నాన్నా" అందరూ తిరిగి చూశారు.

"నేను కాదురా. మీ నాన్న - బాగా చూడు."

"కాదు. వెళ్ళు, వెళ్ళు"

అని జేబులోంచి కాని తీసి యిచ్చాడు దయతలచి. అది తీసుకుని వెంట నడిచాడు సీతయ్య. యముడి వెనక సావిత్రిలాగు.

"కానీ యిచ్చానుగా పో."

"ఇప్పుడెక్కడున్నావు నాన్నా."

తక్కిన డ్రైవర్లు అర్థయుక్తంగా కనుగీటులతో ఒకరి మొహాలు ఒకరు చూసి నవ్వుకుంటున్నారు.

"నా వెంట రాకు పో. యేం? తెలుస్తోందా నే చెప్పేది?"

"సరే నాన్నా!"

"నన్ను నాన్నా అనకు."

"ఎందుకు?"

ప్రకాశి స్నేహితులు నవ్వుతో వొంగిపోతున్నారు.

"పోతావా! తన్నులు కావాలా?"

"ఎక్కడికి పోను? అన్నాడు జాలిగా!

"ఇంటికి పో."

"ఇంటికే వస్తున్నా మరి."

"వీణ్ణి తప్పించుకొని పారిపో. అది అన్యాయమైన పనేగాని, యేం చేస్తావు మరి!" అన్నాడు కండక్టరు కోటయ్య.

"అన్యాయమేమిటి? అన్యాయమంటే యేమిటి నీ ఉద్దేశ్యం?" అన్నాడు ప్రకాశి కోపంగా.

"నీకే తెలియాలి. పాపం! నాకేం తెలుసు? మరి చేసినపనికి అనుభవించవద్దూ?"

"ఎన్నాళ్ళ కిందట చూశావు మీ నాన్నని?" అని అడిగాడు ఒక డ్రైవరు.

"నాకు జ్ఞాపకం లేదు. చాలా నెలలయింది."

"అప్పటికీ యిప్పటికీ మారాడా, మీనాన్న?"

"ఒక్కరవ్వ మారలేదు."

"ఒరే నువ్వు పోతావా పోవా?" అన్నాడు పళ్ళు కొరుకుతో ప్రకాశి - అని త్వరత్వరగా నడిచాడు - ఎదురుగా చూస్తూ.

"ఇంకా వస్తున్నాడు" అన్నాడు డ్రైవరు.

"చాలా పట్టు వుందిరోయీ వీడికి!" అన్నాడు కోటయ్య.

"వాళ్ళ అమ్మ పోలిక అయి వుంటుంది" అన్నాడు యింకోడు. ప్రకాశి మాట్లాడకుండా నడిచాడు దబదబా బస్సు దగ్గిరకి. తన సీటులో ఎక్కి ఒకసారి తిరిగి చూశాడు. ఎన్నడూ లేనిది త్వరగా "స్టార్టు" చెయ్యాలని చూస్తున్నాడు.

సీతయ్య వెనక చక్రాన్ని ఆనుకు నుంచున్నాడు. ఆ మోటారు సొంతదారు - ఆంజనేయులుగారు కుర్రాణ్ణి చూశారు.

"ఏం కావాలి, నీకు?" అన్నాడు.

"మా నాన్న కావాలి."

"ఎవరు మీ నాన్న."

"డ్రైవరు ప్రకాశం."

"ఏమోయ్ ప్రకాశీ ఇట్టారా."

రాలేదు.

"మీ అబ్బాయి వచ్చాడోయ్, నీకోసం."

"మా అబ్బాయి కాదండీ."

"కాదూ ఇక్కడ వుంటేనే, వొచ్చిచూడు."

విధిలేక వచ్చాడు. నవ్వుతున్న కోటయ్యని కాల్చేట్టు చూసి, అటు తిరిగాడు.

"పాపం ఎట్లావున్నాడో చూడు? నీ పిల్లల్ని యిట్లా వుపేక్ష చెయ్యడం ఏమీ బాగాలేదు."

"నాకేం సంబంధం? వీడి మొహం నేనెరుగను."

"మీ నాన్న అట్టా అంటున్నాడేం, అబ్బాయి. నువ్వుండు ప్రకాశి - మీ అమ్మ ఎక్కడ వుంది?"

"చచ్చిపోయిందండి. నాన్న తప్ప నాకెవరూ లేరు."

ఆంజనేయులుగారి మనసు కరిగిపోయింది.

"మీ నాన్నతో బెజవాడ వస్తావా?" సీతయ్య మొహం వికసించింది.

"కోటయ్యా, ఈ కుర్రాణ్ణెక్కించు. మనవాడు, టిక్కెట్టు, గిక్కెట్టు అక్కర్లేదు. మన ప్రకాశి కొడుకయ్యేను."

"మన వాడేమిటి నాకేం తెలవదండోయ్."

"ఎందుకులే, నేనేం అడగనంటూ వుంటే? ఎవరో అంత బొంతర వాళ్ళని వూరికే ఎక్కిస్తే కోపమొస్తుంది గాని సొంత కొడుకైనప్పుడు నేనేమంటాను? పాపం - ఆకలిగా వున్నట్టుంది ఏమన్నా కొనిపెట్టు. నీ దగ్గిర డబ్బులు లేవు గావును ఇదిగో అబ్బాయి, పావలా - కాఫీ హొటలుకు పో - తరువాత ఇద్దుగానిలే ప్రకాశీ-"

కుర్రాడు పావలా తీసుకుని "నేను వచ్చిందాకా పోకండి" అని హొటలు వేపుకు దూకాడు.

"ఈ బస్సుల వాళ్ళు - వీళ్ళకి ప్రతివూళ్ళో ఒక భార్య."

"ఈయన్ది బెజవాడగా."

"ఐతేనేం, యీ వూళ్ళో ఒక భార్య వుంటుంది."

"తన కొడుకునే మరచిపోయినారు."

"బలేవాడు-"

"మొహాన అట్టా పోలిక కనబడుతుంటే - పైగా బూకరిస్తాడేమిటి?"

"తల్లి పనికొచ్చిందిగాని, పిల్ల పనికిరాలేదు."

కుర్రాడు వొచ్చాడు. పొట్టా, జేబులూ నింపుకుని, ప్రతివాళ్ళూ చోటిచ్చి రమ్మనే వాళ్ళే! బస్సు బయలుదేరింది. కొంచెంసేపట్లో ఆంజనేయులు కేకలు వేస్తున్నాడు.

"ఇదిగో ప్రకాశం యేమిటి 'నీ కుర్రాడు - అరే, కిందపడేట్టున్నాడు - వీడికి భయభక్తులులేవే! ఆ మూట కింద తోశాడు. ఆపు - ఆపు-"

"ఇంత అల్లరి యెట్లా నేర్పావయ్యా! మా అందరికి పిల్లలు లేరా?" అన్నాడు ఒకాయన "నేనా!" అన్నాడు చివరికి ప్రకాశం.

"మొత్తానికి నీ గుణాలే - ఒక్కొక్కటే బైటికొస్తున్నాయి. చిన్నప్పుడు మనం చదువుకునేప్పుడు నువ్వింతే!" అన్నాడు కోటయ్య.

"అట్లా చూస్తో నుంచుంటావే? నీ కుర్రాణ్ణి సద్దుకో మా ప్రాణాలు తీస్తున్నాడు" అన్నాడు ఇంకో పెద్ద మనిషి. ఏ లోకంలో వున్నాడో కలో మాయో నిశ్చయించుకోలేని చూపు పెట్టి చక్రంముందు కూచున్నాడు ప్రకాశి. మధ్య ఊళ్ళో బస్సాగింది. మళ్ళీ కాఫీ హొటల్లోకి అందరూ ప్రవేశించారు.

"నాన్నా ఆకలిగా వుంద"ని ప్రకాశి వెంట బైల్దేరాడు, కుర్రాడు.

"పోరా వెధవా" అని తప్పించుకుని గుంపులో ప్రవేశించాడు ప్రకాశి. బస్సు బయలుదేరాలి, డ్రైవరు లేడు. పిలిచారు, వెతికారు, గంటసేపు చూశారు, కనపడలేదు.

"నాన్నా, నాన్నా" అంటూ యేడుస్తున్నాడు కుర్రాడు.

కోటయ్య మోటారు నడపవలసి వచ్చింది.

"మరి యీ కుర్రాణ్ణి యేం చేద్దాం?" అన్నాడు కోటయ్య.

ప్రకాశి యెంత రౌడీ ఐనా యింత నిలబడలేని టక్కరివాడనుకోలేదు. తన సొంత కుర్రాణ్ణి యిట్లా నడివడిలో వొదిలిపోయినాడే! మరీ యింత ఘాతుకుడనుకోలేదు" అన్నాడు ఆంజనేయులు.

"కుర్రాడు, యేం చేస్తాం? బెజవాడలో ప్రకాశి దగ్గిర వదలి పెడదాం."

"వాడిల్లు నాకు సరిగా తెలీదు" అన్నాడు కోటయ్య.

"ఏం చేస్తావు సీతయ్యా!"

"ఏం చెయ్యను?" అని బాధ్యత వాడికే వదిలివేశాడు.

కొంచెం ఏడుపుమాని జాలి పుట్టించేట్టు అందరి మొహాలు చూసి, ముడుచుకొని ముసిలమ్మ వొళ్ళో తల పెట్టుకొని నిద్రపోయాడు. ఒక అరగంటలో నిద్రపోయి లేచి ప్రక్కనున్న రెడ్డిగారి బోదకాలు తొక్కి, కమ్మగారి తొడలు విరిగేటట్టు మీద నుంచుని, సీటునుంచి సీటుకి గంతులు వేస్తున్నాడు.

బెజవాడ చేరారు. ఒక్కొక్కళ్ళే దిగిపోతున్నారు. దిగిపోయే వాళ్ళందరిని "మీ యిల్లెక్కడ!" అని అమాయకంగా ముద్దొచ్చేట్టు అడుగుతున్నాడు కుర్రాడు.

"మరి కుర్రాడో?" అన్నాడు కోటయ్యా.

"ఏం చేస్తాం? రాత్రి యిక్కడ పడుకొని, రేపు మళ్లీ ఆ వూరే తీసుకుపోయి దిగపెడదాం" అన్నాడు కనికరంగల ఆంజనేయులు.

కోటయ్యా, ఆంజనేయులూ, బజారువీధినుంచి నగరప్పేటవేపు పోతున్నారు. తెలిసినవాణ్ణి పిలవడానికని కోటయ్య వెనక్కు తిరిగిచూసి 'అరే' అన్నాడు.

కొంచెం దూరంలో నెమ్మదిగా బెజవాడ పురజనుల ఔదార్యమూ, పట్టణ సౌందర్యమూ తీరుబడిగా తిలకిస్తో సీతయ్య వొస్తున్నాడు.

ఆంజనేయులూ, కోటయ్యా, ఒకరిమొహాలు ఒకరు చూసుకున్నారు. తనమీద వాళ్ళు తీసుకుంటున్న శ్రద్ధను గమనించి, వాడు-

"నాన్నా!" అన్నాడు.

"నిన్ను పెంచుకున్నాడోయి, కోటయ్యా" అన్నాడు ఆంజనేయులు.

"మిమ్మల్ని" అన్నాడు కోటయ్య. అప్పుడే యిద్దరు ముగ్గురు రోడ్డుమీద ఆగిచూస్తున్నారు. కోటయ్య, ఆంజనేయులు త్వరత్వరగా నడిచారు.

"నాన్నా, ఆగు త్వరగా వెడుతున్నావు" అని అన్నాడు సీతయ్య.

"నేనా సందున పోతాను పనివుంది" అన్నాడు కోటయ్య.

"అరే, ఆ కుర్రాణ్ణి ఏం చేసుకోమంటావు?" పొమ్మని కేకెయ్యి."

"మీకోసం వొస్తున్నాడు. ఎవరికోసం సీతయ్యా" అన్నాడు దయగా.

"నాన్న కావాలి" అని ఆంజనేయుల్ని చూపించాడు.

"ఎవరు కావాలి" అన్నాడు భయంగా ఆంజనేయులు.

"నువ్వే నాన్నా."

ఆంజనేయులు త్వరత్వరగా వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు యింటికి.

వాకిట్లో అతని భార్య నుంచుని వుంది. గుంపంతా సమీపించారు.

"ఏమిటీగోల?" అన్నది కాంతమ్మ అతని భార్య.

"ఏమీలేదు. లోపలికి పద."

"ఆ కుర్రాడెవరు?"

"పాపం ఎవరో వెర్రి కుర్రాడు, మా బస్సు ఎక్కాడు."

"నేను వెర్రివాణ్ణా, నాన్నా! కాను."

"పాపం పిచ్చి వాడికి" ప్రకాశి కొడుకునన్నాడు పాపం."

"కాదు, నువ్వు నా నాన్న."

"అంతేలే కనపడ్డ ప్రతివాణ్ణీ నాన్న నాన్న అంటాడు. అదీ వాడి పిచ్చి. కొంతసేపు కోటయ్యని నాన్నా అన్నాడు."

"లేదు నన్ననలేదు."

"తరవాత ఈ శేషయ్యగార్ని నాన్న అన్నాడు.... మిమ్మల్ని కాదేమిటి? ఆ శెట్టిగారిని."

"గావును."

"సరేలెండి, ప్రకాశిని అన్నాడా లేదా?"

"ప్రకాశి ఏడీ ఐతే?" అంది కాంతమ్మ.

"వాడు పారిపోయినాడు."

"ఆహా, తెలుస్తోంది. ఈ పెద్దమనుష్యులందరూ వీడు ప్రకాశి కొడుకని నాతో చెప్పడానికి వొచ్చారా?"

"అవును" అన్నారు అందరూ.

కాంతమ్మ రోడ్డువంక చూసింది. కన్నీళ్ళతో, గద్గద స్వరంతో "ఎంతపని చేశారండీ" అంది.

"నేనేమీ ఎరగను కోటయ్యని అడుగు."

"అడగడమెందుకులెండి? మీకండక్టరేమంటాడు, అంతకంటే."

"ఈ పెద్ద మనుష్యులు చూడలేదూ? వాళ్ళనడుగు ఈ కుర్రాడెవరికోసం వచ్చాడో అసలు."

"వాళ్ళు మాత్రం మీ స్నేహితులు కారా? ఎందుకులెండి. ఎంత అన్యాయం చేశారండి, నన్ను! ఎంత నమ్మాను!"

"ఏంరా! వెధవా, పాపం ఆంజనేయులుగారు నిన్ను అంత దయతో చూసినందుకు ఆయనకీ కుంపటి తెచ్చిపెట్టావా?" అన్నాడు శేషయ్య.

"దయగా చూశారా?" అంది కాంతమ్మ మండిపడుతూ.

"సొంత కొడుకు-కాదు - మేనల్లుడిమల్లె చూసుకున్నాడు. ఎవర్నీ లేంది. వీణ్ణి టిక్కెట్టు లేకుండా బస్సులో ఎక్కించాడు. ఫలహారం పెట్టించాడు. మా అందరికీ ఆశ్చర్యం వేసింది. ఆయన చూపే ప్రేమ చూసేప్పటికి."

ఇంత గొప్పగా పొగుడుతున్నా, ఆంజనేయులు మొహం మాత్రం మండి పోతుంది.

కాంతమ్మ యింక భరించలేక చప్పున యింట్లోకిపోయి తలుపేసుకుంది. గుంపులో మనుషులంతా ఒకరొకరే జారిపోయినారు. అందరూ పోగానే ఆంజనేయులు యింట్లోకి వెళ్ళాడు. ఏడుస్తో కాంతమ్మ పక్కమీద పడుకుంది.

"ఒసే - మాట"

"నాతో మాట్టాడకండి. నా మొహం చూడ్డానికి సిగ్గులేదూ?"

"నా మాటవిని ముందు..."

"నేననుకుంటూనేవున్నా, యేదో యిట్టాంటిది రహస్యంగా జరుగుతుందని - బస్సు అనేదీ, రాత్రంతా ఎక్కడో వుండిపొయ్యేదీ. డబ్బు అంతా యేమవుతుంది? మొన్న లైసెన్సుకి అడ్డిగ అమ్ముతానని తీసుకెళ్ళారే? యిదా సంగతి! యెంత మోసం చేశారండీ?.... ఎప్పుడూ దిగులుగా కూచోడం - అదీ - తెలిసిపోతోంది - అంతా తెలిసింది."

"విను-ముందు."

"వినడమే! ఏమిటి వినడం? ఎందుకు వినడం - మీ అబద్ధాలన్నీ! ఇంకా మోసపోతానా? నే నూరుకోను. చూడండి... ఏం చేస్తానో! ఇంతటితో మీకు నాకు సరి."

"విను - కుర్రాడు ప్రతివాణ్ణి అంటాడు నాన్నా అని, ఈపాటికి యింకెవణ్ణో పట్టుకుని వుంటాడు."

"నేనూరుకోను - యిది వూరంతా" - అంటూవుండగానే, మెల్లిగా తలుపు తెరుచుకొని మొహం లోపలికి పెట్టి చూస్తున్నాడు సీతయ్య. మండిపడుతో కాంతమ్మ వాడివేపు చూసింది. ఎవరూ మాట్టాడలేదు రెండు నిమిషాలు.

"అమ్మా" అన్నాడు సీతయ్య నెమ్మదిగా. తలఎత్తి చూసింది. నిర్ఘాతపోయి కుర్రాడి మొహంచూస్తో పడుకుంది. తలుపు ఇంకొంచెం తెరుచుకుని లోపలికి వచ్చాడు. ఆంజనేయులు భార్యవైపు చూశాడు. నవ్వాపుకోలేక కిటికీ వైపు తిరిగాడు.

"అమ్మా యేం అట్లా పడుకున్నావు?"

"ఎంత పనిచేశావే నన్ను యింత మోసం చేశావనుకోలేదు."

"పోండి, వేళాకోళం చేస్తారు!"

"సందేహం లేదు - పోలిక కనపట్టం లేదనుకున్నావా? పగలంతా లైను మీద చస్తాను - యింటిదగ్గర నువు చేసే పని యిదా? యెప్పుడు కన్నావు వీణ్ణి?" అంటో నవ్వాపుకోలేక కిటికీకేసి తిరిగాడు. కాంతమ్మ లేచి అతని మెడ గట్టిగా పట్టుకుంది.

"అంటారు! నన్నట్లా అంటారూ?"

"ఏమిటా, దిగులుగా ఆలోచిస్తో కూచుంటుంది అనుకున్నాను. ఎంత యిచ్చినా చాలదంటుంది. ఏమవుతుందా అనుకున్నాను."

కాంతమ్మ అతని నోరు మూసింది.

"ఏంరా, వెధవా! నేను నీకు అమ్మనట్రా?"

"అవును అమ్మవేగా?" అని నిశ్చయంగా అన్నాడు.

హడిలిపోయి చూసింది కుఱ్ఱాణ్ణి. చప్పున ఆపుకోలేక ఒక పెద్ద నవ్వు నవ్వింది. ఆంజనేయులు అపుకున్న నవ్వును అంతా నవ్వేశాడు. ఇద్దరూ సీతయ్యని లాక్కుని కౌగలించుకున్నారు.

(అనువాదకథ)

◆ ◆ ◆

*రచనాకాలం : **1932** (అనువాదం)*

*ప్రచురణ : **(ముక్కమ్మ కథలసంపుటి) దేశి కవితామండలి, 1956***